క్లుప్తంగా

ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

భద్రాచలంటౌన్: హరిత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం మండలంలోని ప్రతి ఇంటికీ ఆరు రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ బొగ్గా నారాయణ తెలిపారు. పట్టణంలోని కేసీఆర్ కాలనీలోని నర్సరీ నుంచి మంగళవారం కాలనీ వాసులకు మొక్కలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 1లక్ష మొక్కలను పెంచడం జరిగిందన్నారు. ప్రజలకు 22 రకాల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి మొక్కలను తీసుకున్న వారు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీష్ పాల్గొన్నారు.

వనమహోత్సవం..



మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం రేంజ్ కాంప్లెక్స్ పరిధిలోని అటవీప్రాంతంలో వనమహోత్సవంలో భాగంగా మంగళవారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ సుజాత మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేంజర్ కమల, డీఆర్వో శోభన్, ఎఫ్ఎస్ఓ నంధా, ఆదినారాయణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జూపల్లి రమేష్ భూమిపూజ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ బజార్, పాత ఆంధ్రా బ్యాంక్ రోడ్, పాపిడిగూడెం రోడ్, ఖమ్మం రోడ్‌లో మొత్తం నాలుగు సీసీ రోడ్లు పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరు కాగా.. ఈ రోడ్ల నిర్మాణాలకు ఆయన కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ రేమళ్ల కేధార్‌నాథ్, కాంగ్రెస్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, వేముల భారతి, అల్లాడి రామారావు, ఎండి.ముర్తుజా ఖాన్, రామస్వామి, కర్నాటి శ్రీను పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె



బూర్గంపాడు: పీహెచ్‌సీ వైద్యురాలికి సమ్మె నోటీస్ అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ములకలపల్లి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మండల అధ్యక్ష, కార్యదర్శులు సూరం పుల్లారావు, ఓరుగంటి శ్రీను డిమాండ్ చేశారు. సంఘ మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న వారు మట్లాడారు. కార్మికులకు పనిభద్రత కల్పించాలని అన్నారు, కోండ్రు నాగరాజు, సంగు శ్రీను, పొక్కిలి దానియేలు, కోండ్రు వీరభద్రం, హలావత్ శివ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత..

బూర్గంపాడు: జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం కోరారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీసాహితికి మంగళవారం ఆశవర్కర్లతో కలసి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సారపాకలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడారు.

జోరు వర్షం

మణుగూరుటౌన్: మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచి గ్రామాల్లోని వీధులన్నీ బురదమయంగా మారింది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి స్వల్ప అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు తెలిపాయి.

వంతెన.. అంతేనా?

- మండల కేంద్రానికి ఆ ఒక్కటే దారి
- వైద్య సేవలు, వ్యవసాయ మందులకు తప్పని రాకపోకలు
- వరదలొస్తే ప్రమాదం ముంచుకొచ్చినట్లే..



గత సంవత్సర వరదలకు కుంగిపోయిన బ్రిడ్జి

గుండాల: ఏడాది కిందట ఓ బ్రిడ్జి కుంగిపోయింది. ఆ బ్రిడ్జిపై నుంచే ఇప్పటికీ ప్రజలు రాకపోకలు సాగించక తప్పటడం లేదు. ఎప్పుడు కూలుపోతుందోనని భయంతోనే ఆ గిరిజన పల్లెల ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. మళ్లీ వర్షాలు ఎక్కువై వరదలతో ఆ బ్రిడ్జీ ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు దీనిపై కన్నెత్తి చూడడం లేదు. స్థానికులు ఏడాది నుంచి మొర పెట్టుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

ఆళ్లపల్లి మండల కేంద్రం నుంచి లక్ష్మీపురం వెళ్లే మార్గం మధ్యలో ఎర్రచెరువు అలుగు వర్రెపై ఆ వంతెన ఏనాడో నిర్మించారు. కాల క్రమేనా ఆ బ్రిడ్జీ శిథిలావస్థకు చేరి గత ఏడాది అలుగు వరద ఉధృతికి కుంగిపోయింది. లక్ష్మీపురం, పెద్ద వెంకటాపురం, సింగారం గ్రామాల ప్రజలకు ఆ రోడ్డు ఒక్కటే దిక్కు. దీంతో వేరే ప్రత్యామ్నాయం దారి లేక ఆ కుంగిన బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు, వరద ఉధృతి ఎక్కువైతే కూలిపోయే ప్రమాదం ఉంది.

మండల కేంద్రంతో అనుసంధానం

ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఏ చిన్న అవసరమైనా ఆళ్లపల్లికి రావాల్సిందే. దీనికి ఆ బ్రిడ్జి ద్వారా ప్రయాణించడం ఒక్కడే మార్గం. ముఖ్యంగా వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. ఎరువులు, పురుగుమందులు విత్తనాలు వాహనాలపై తీసుకెళ్లేందుకు ఆ బ్రిడ్జిపై నుంచి పడరాని పాటు పడుతున్నారు. అంతేకాకుండా వైద్యం నిమిత్తం ఆళ్లపల్లి ఆస్పత్రికి వస్తుంటారు. ఇలా వివిధ రకాల పనులపై రాపోకలు సాగించే ఆదివాసీలు క్షణమొక యుగంలా ప్రయాణా సాగిస్తున్నారు. ఈ వర్షాలు ఎక్కువైతే ఏ క్షణంలో కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

నిధులు వచ్చినా ఫలితం లేదు

గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి కింద ఆళ్లపల్లి మండల కేంద్రం నుంచి వెంకటాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.8 కోట్ల నిధులు మంజూరి అయ్యాయి. పనులు చేపట్టిన అధికారులు లక్ష్మీపురం వరకు మాత్రమే పూర్తి చేశారు. వెంకటాపురం వరకు అటవీశాఖ అనుమతులు లేక పనులు నిలిపివేశారు. ఈ రోడ్డు నిర్మాణంతోనైనా బ్రిడ్జికి మోక్షం కలుగుతుందని కలలు కన్న ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గత కొన్నేళ్లుగా రోడ్డు కావాలని వెంటపడుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, జిల్లా అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కుంగిపోయిన నాటి నుంచి అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు గెలిచిన తర్వాత మొహం చాటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు ఉన్నప్పటికీ ఈ చిన్న రోడ్డుకు అనుమతులు తీసుకవచ్చేందుకు స్పందన కరువైందని అంటున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జికి మరమ్మతులు, లేదా శాశ్వత పరిష్కారంతో పాటు, రోడ్డు నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరం ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది.

నడవాలంటే భయంగా ఉంది..



ఏడాది క్రితం కుంగిపోయిన బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి. లేదంటే నూతనంగా బ్రిడ్జి నిర్మించాలి. నిత్యం ఆ బ్రిడ్జిపై నుంచే నడవాలంటే భయంగా ఉంది.

– కోటేశ్వరరావు, లక్ష్మీపురం

చేను పనులకు వెళ్తాం..



చేను పనులకు ఆ రోడ్డు నుంచే వెళ్తుంటాం. ఎరువు బస్తాలతో వెళ్తుంటే బ్రిడ్జిపై భయమేస్తోంది. ఈ సారి చెరువు అలుగు ఉధృతి పెరిగితే ఏ క్షణంలోనైనా బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది.

– హరీష్, ఆళ్లపల్లి

అటవీ శాఖ అనుమతులు లేవు..

కొత్తబ్రిడ్జి నిర్మాణం కోసం ప్రణాళికలు పంపించాం. అటవీశాఖ అనుమతులు లేక సంబంధిత పనులు ముందుకు సాగడం లేదు.

– మోతీలాల్, ఆర్అండ్‌బీ ఏఈ

జీపీ కార్మికుల విధుల బహిష్కరణ



చండ్రుగొండ: ఎంపీడీఓకు సమ్మె నోటీస్ ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఫలితంగా ఇంటి పోషణ ఇబ్బందికరంగా మారిందని చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి రెండు మండలాల్లోని పంచాయతీ కార్మికులు మంగళవారం విధులు నిరాకరించారు. మేరకు చండ్రుగొండలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, అన్నపురెడ్డిపల్లిలో ఎంపీడీఓ కార్యాలయ ఇన్‌చార్జ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. సత్వరమే వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.



పొలంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు రాంబాబు

వ్యవసాయ పనులకు కార్మికుడు..

మూడు నెలలుగా జీతాలు రాకపోవడం, తాజాగా మంగళవారం నుంచి కార్మికులు సమ్మె బాట పట్టడంతో చండ్రుగొండ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కుంపటి రాబాబు వ్యవసాయ పనులకు కూలీ పనులకు వెళ్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి పోషణ భారంగా మారిందని అతడు వాపోయాడు. కూలీ పనులతోనైనా కుటుంబాన్ని పోషించుకునేందుకు పొలం పనులకు వెళ్తున్నట్లు అతడు చెప్పాడు. పంచాయతీ కార్మికులకు నెలవారీ జీతాలు పెండింగ్ పడడంతో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది తార్కాణం.

జాతీయ వైద్యుల దినోత్సవం

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు కేక్‌లు కట్‌చేసి తోటి వైద్యులకు, సిబ్బందికి తినిపించుకున్నారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతోపాటు గ్రామీణ వైద్యులను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఆస్పత్రులకు వస్తున్న రోగులకు వెద్యులు చేస్తున్న సేవలు మరవలేనివని వారు అభినందించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: వైద్యులను సన్మానిస్తున్న ఏఎన్ఎంలు, ఆస్పత్రి సిబ్బంది



భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు



భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే, వైద్యుడు తెల్లం వెంకట్రావ్‌కు జ్ఞాపిక అందజేస్తూ..



బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో డాక్టర్స్ డే వేడుకలు



మణుగూరురూరల్: వైద్యులను సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు



అన్నపురెడ్డిపల్లి : పాఠశాలలో డాక్టర్ ప్రియాంకను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



దమ్మపేట: వైద్యులను సన్మానించిన వాసవీ క్లబ్ సభ్యులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని నామవరంలోని 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులతోపాటు ట్రీకటింగ్ నేపథ్యంలో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజాపురం, నామవరం గ్రామాలకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఈ-బయ్యారం ఎస్‌హెచ్‌ఓగా సురేష్

పినపాక: ఈ–బయ్యారం ఎస్‌హెచ్‌ఓగా పి.సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఐటీ కోర్‌లో విధులు నిర్వహిస్తున్న సురేష్ ఇక్కడిరాగా.. ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌ఓ గా విధులు నిర్వహించిన రాజ్ కుమార్‌ను ఐటీ కోర్ కు బదిలీ చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరే విధంగా చూస్తానని పి.సురేష్ తెలిపారు.

యూరియా సరఫరాపై ఆందోళన వద్దు

బూర్గంపాడు: యూరియా సరఫరాపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఏడీఏ తాతారావు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో యూరియా కొరత ఉందనే ప్రచారాన్ని నమ్మి రైతులు యూరియా కొనుగోళ్లకు తొందరపడవద్దని కోరారు. గతంలో మాదిరి ఈ ఏడాది కూడా పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా ఉంటుందని తెలిపారు. రైతులు పంటల సాగులో యూరియా వినియోగాన్ని మోతాదుకు మించి వాడవద్దన్నారు.

వానాకాలం అప్రమత్తంగా ఉండాలి

మణుగూరుటౌన్: వానకాలం వాతావరణం తేమతో నిండిపోవడంతో బ్యాక్టీరియాతో వైరస్‌లు సులభంగా పెరిగే అవకాశం ఉంటుందని, వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పిచ్చి మొక్కలు తొలిగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

బీపీ, షుగర్ పరీక్షలు

మణుగూరురూరల్: మండల కేంద్రమైన మణుగూరు పట్టణంలోని శ్రీదేవి మెడికల్ షాప్ ఎదుట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా షుగర్, బీపీ పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్, బీపి వ్యాధులతో బాధపడుతున్న పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శ్రీదేవి మెడికల్ షాప్ యజమాని ముత్తం శెట్టి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘సీతారామ’కు ప్రత్యామ్నాయం ‘ప్రగళ్లపల్లి’



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మ సాగర్‌తో ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రగల్లపల్లి వద్ద ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే రైతులకు సాగునీరు అందుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఈ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి దుమ్ముగూడెం మండలాన్ని సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గంగోలు వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ 20వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను మండల కార్యదర్శి రావులపల్లి రవికుమార్ ఆవిష్కరించారు. ఆపై కిలిమి ఎల్లారెడ్డి, పాయం ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడారు. అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో పోడు రైతులకు తమ పార్టీ అండగా నిలిచిందని గుర్తు చేశారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోల్లోజు అయోధ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరు వెంకటేశ్వరరావు, బొల్లోజు వేణు, పాయం ఎర్రయ్య ,మడకం ముత్తయ్య, కాకా వెంకటేశ్వర్లు, పాయం రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీపీఐ మండల కార్యదర్శిగా సీతారాంపురం గ్రామానికి చెందిన బోల్లోజు వేణును, సహాయ కార్యదర్శులుగా తాటిపూడి రమేష్, కాకా వెంకటేశ్వర్లతో పాటు 53 మంది మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ



కరకగూడెం: ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ ఛటర్జీ



పినపాక: ఎరువుల దుకాణంలో మందులను పరిశీలిస్తున్న సీఐ, ఏఓలు

కరకగూడెం: మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాల్లో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఛటర్జీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. వాటి నాణ్యత, కాలపరిమితి తేదీలు,ధరలు,విక్రయ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపినా, రికార్డులు సరిగా నిర్వహించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కూడా ప్రభుత్వం గుర్తించిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఉత్పత్తిపై అనుమానం వచ్చినా.. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసినా.. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఏఈఓ అనిల్ కుమార్ తనిఖీల్లో పాల్గొన్నారు.

నకిలీలు అమ్మితే కఠిన చర్యలు

పినపాక: రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో పలు ఎరువుల దుకాణాలను ఏఓ వెంకటేశ్వర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లోని మందులను, దుకాణాల పత్రాలను ఆయన పరిశీలించారు. రైతులకు నాణ్యమైన మందులు, ఎరువులు, విత్తనాలు అందజేయాలని దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు శక్తి తగ్గిపోతోంది..



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య

దమ్మపేట: దేశంలో రాజకీయ నాయకుల అసమర్ధ పాలన వలన సామాన్య ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకూ తగ్గిపోతుందని సీపీఎం జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పుల్లయ్య మాట్లాడుతూ.. అసమానతలు లేని సమ సమాజమే లక్ష్యంగా సీపీఎం పార్టీ అలుపెరగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రంగాలు సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్న పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం శోచనీయం అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో మతం పేరుతో రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, ఎర్రా శ్రీనివాసరావు, మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను, శోభన్‌బాబు, కేశవరావు, అప్పారావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో పడకేసిన పారిశుద్ధ్యం

- కాలువల్లో నిలిచిన పూడిక
- సక్రమంగా సాగని చెత్త సేకరణ
- ఖాళీ స్థలాల్లో గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలు



శాంతినగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేక నిలిచిన మురుగు నీరు




శిల్పినగర్‌లో ఖాళీ స్థలం నుంచి డ్రెయినేజీని కమ్మేసిన పిచ్చి మొక్కలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఒక వైపు పడుతున్న వర్షాలు, మరో వైపు పట్టణంలోని పలు కాలనీలలో పారిశుద్ధ్యం లోపించడం కారణంగా ఆయా కాలనీలలో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

భద్రాచలం పట్టణంలో తడిపొడి చెత్తను వేరుచేయడంలో, దానిపై అవగాహన కల్పించడంతో ముందున్నప్పటికీ పలు చోట్ల పారిశుద్ధ్యం అత్యంత హీనంగా తయారైంది. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయింది. పలు చోట్ల మరమ్మతులకు గురైన వీధి దీపాలకు వెలగడం లేదు. కొన్ని కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థనే లేదు. ఈ సమస్యలపై దృష్టి పెట్టిన అధికారి లేదు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో 210 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా కేవలం 70 మంది మాత్రమే తమ విధులను నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగానే ఈ సమస్య తలెత్తుతున్నాయి. కాగా దీనిని అదిగమించేందుకు సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు సూన్యం. దీనికితోడు భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్ వ్యక్తుల స్థలాలపై ఆయా యజమానుల నిర్వహణ లోపాల కారణంగా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోతున్నాయి. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులు కేవలం ఆయా స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భద్రాచలం పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను త్వరగా పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.


కాలువలో పూడిక తొలగించాలి



పట్టణంలోని శిల్పినగర్ కాలనీలో రోజు వారి చెత్త సేకరణతో పాటు డ్రెయినేజీ కాలువల్లో పూడిక తొలగింపు చర్యలు క్రమ పద్ధతిలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్యం లోపించి అనారోగ్యాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. కాలనీల్లో ఫాగింగ్ చేపట్టి దోమల బెడద నుంచి స్థానిక కాలనీ ప్రజలను కాపాడాలి.

– వెంకటలక్ష్మి, శిల్పినగర్, భద్రాచలం

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..



పట్టణంలోని అన్ని కాలనీల్లో ప్రతి రోజూ చెత్తను సేకరిస్తూ, సదరు పనులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. ఒకవేళ అలా జరగకపోతే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. పట్టణంలో ఉన్న ఏ కాలనీలో అయినా పారిశుద్ధ్యం లోపించడం, వీధి దీపాలు వేలగకపోవడం తదితర సమస్యలుంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలి.పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– శ్రీనివాసరావు, భద్రాచలం జీపీ ఈఓ